
ok telugu
క్షణం క్షణం.. నిఖార్సైన సమాచారం..
1 శుక్రవారం 10 -04- 2026

# రాధాకృష్ణపై జగన్ శపథం



- ఏబీఎన్ ఆంధ్రజ్యోతిపై వైసీపీ యుద్ధం
- వీకెండ్ కామెంట్ లో రాధాకృష్ణ వ్యాఖ్యలపై ఆగ్రహం
- అలా అయితే ప్రతిరోజూ సాక్షిని శిక్షించాల్సిందే
- మీడియా యుద్ధంలో ఎవరిది పైచేయి!
- వైసీపీ తీరుపై రాష్ట్ర వ్యాప్తంగా ఇదే చర్చ



ఆర్కేను పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పిస్తానంటూ జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో సంచలనం రేపుతున్నాయి. ఒక వ్యక్తిగత అభిప్రాయంపై ఇంతటి ఆగ్రహం ఎందుకు? గతంలో రాజశేఖర్ రెడ్డి నుంచి నిన్నటి జగన్ పాలన వరకు సాధ్యం కానిది ఇప్పుడు సాధ్యమేనా? అసలు సాక్షి మీడియా వైఖరిని ప్రశ్నిస్తున్న ప్రత్యర్థులు, ఏబీఎన్ ముందు ధర్నాలను ఏ విధంగా సమర్థించుకుంటున్నారు? ఇటు ఆర్కే పదునైన విమర్శలు.. అటు జగన్ ప్రతీకార శపథాల మధ్య ఆంధ్రజ్యోతి-వైసీపీ వార్ ఏ మలుపు తీసుకోనుంది?

ఓకే తెలుగు ఏపీ బ్యూరో

3వ పేజీలో

# 'ఆట' మొదలు

- మాజీ మంత్రి రోజా, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి చుట్టూ ఉచ్చు
- ఆడుదాం ఆంధ్ర అవినీతిపై ప్రభుత్వం ఫోకస్
- ఇద్దరు నేతల అరెస్టు తప్పదా?

4వ పేజీలో



# జగన్ 'మావిగన్'

- కొత్త రాజధాని ప్రాతిపాదనతో జగన్మోహన్ రెడ్డి
- ఆశ్చర్యపోయిన ఏపీ ప్రజలు
- సోషల్ మీడియాలో ట్రోల్స్

2వ పేజీలో







## 'డెకాయిట్' హిట్ కొట్టిందా?

8వ పేజీలో





## 'ఎల్.ఐ.కే' మూవీ ఎలా ఉంది?

# అప్పుడు బీటీ.. ఇప్పుడు వీటీ

- నమ్ముకున్నోడు 'జెండా కూలీ'.. జంపింగ్ జపాంగ్‌లే అసలు 'పాలీ'!
- పార్టీనే నమ్ముకున్న వాళ్లకు గుండు సున్నా
- అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ లో రాజకీయ సెగలు
- కొత్తవాళ్లు వస్తున్న నేపథ్యంలో ప్రధాన పార్టీలలో జడలు విప్పుతున్న అసంతృప్తి
- వచ్చే ఎన్నికల్లో ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపిస్తాయని చెబుతున్న రాజకీయ విశ్లేషకులు

5వ పేజీలో




రాజకీయాలలో స్వప్రయోజనాలు మాత్రమే ఉంటాయి. అంతిమంగా కావాల్సింది అధికారం. ఇక్కడ ప్రజాస్వామ్యం అనే మాటకు ఆస్కారం లేదు. విలువలు అనే మాటకు విలువలేదు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం రాజకీయ పార్టీల వ్యవహార శైలి పై ఉపోద్ఘాతానికి నూటికి నూరు శాతం సరిపోతుంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎన్నికలకు ముందే వాతావరణాన్ని వేడెక్కించాయి. గులాబీ పార్టీలో ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా చేసుకుంటే.. కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తులను గులాబీ పార్టీ టార్గెట్ గా చేసుకుంది. దీంతో ఇన్నాళ్లపాటు ఆయా పార్టీలలో పనిచేసిన వారంతా మథనపడుతున్నారు. కొత్త వాళ్లు వస్తే.. మాకు అవకాశాలు ఎవరిస్తారని ప్రశ్నిస్తున్నారు. అయితే పాత వాళ్లకు రెండు పార్టీలు కూడా ప్రయారిటీ ఇవ్వడం లేదు. స్థూలంగా చెప్పాలంటే పాత వాళ్లంతా జెండా కూలీలు గానే మిగిలిపోయారు.



# దేదీప్యమానంగా అమరావతి

**అమరావతికి రాజముద్ర పడింది. కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించింది. పార్లమెంటు ఉభయసభలు ఆమోదించాయి. గవర్నర్ సైతం ఆమోదముద్ర వేస్తూ ఫైల్ పై సంతకం పెట్టారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. దీంతో గత కొద్దిరోజులుగా జరుగుతున్న గందరగోళానికి, విష ప్రచారాలకు చెక్ పడినట్లు అయింది. సిఆర్డిఏ ప్రాంతాన్ని అమరావతి రాజధానిగా గుర్తిస్తారు. అయితే ఈ పరిణామం వెనుక కేవలం అమరావతిని ఏకైక రాజధాని అని చెప్పడమే కాదు.. చాలా అంశాలు ఇందులో దాగి ఉన్నాయి. 2014లో రాష్ట్ర విభజన జరిగిన సమయంలోనే పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ను నిర్ణయించారు. ఆ గడువు 2024 జూన్ 2 తో ముగిసింది. అందుకే గెజిట్ నోటిఫికేషన్ లో అమరావతి రాజధానిని ఆ తేదీ నుంచి గుర్తిస్తూ ఆమోదముద్ర వేస్తారు. అమరావతి ఏకైక రాజధానికి చట్టబద్ధత కల్పించడం వెనుక కేవలం జగన్మోహన్ రెడ్డిని అడ్డుకోవడం మాత్రమే కాదు. అంతకంటే లోతైన ఆర్థిక,, చట్టపరమైన వ్యూహాలు ఉన్నాయి.**

***రక్షణ కవచంగా కేంద్ర ప్రభుత్వం***
***చట్టబద్ధతతో రాజముద్ర***
***ఎవరూ కదిలించలేని స్థితికి..***
***ఢిల్లీ వెలుపల బలమైన పవర్ సెంటర్***

(ఓకే తెలుగున్యూస్)

అమరావతికి వరుస శుభవార్తలే. అమరావతికి చట్టబద్ధతతో కేంద్రం రక్షణ కవచంగా నిలిచింది. అమరావతి గడ్డపై తన ముద్రను బలంగా చాటుతోంది కేంద్ర ప్రభుత్వం. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ బయట కేంద్ర ప్రభుత్వ పరిపాలన వ్యవస్థ కోసం భారీ భవనాన్ని నిర్మించాలని నిర్ణయించింది. అమరావతిలో కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణానికి కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. ఇది నిజంగా అమరావతికి గుడ్ న్యూస్. ఎందుకంటే అమరావతికి చట్టబద్ధత కల్పించడమే కాదు.. తోడుగా నిలవాలని కేంద్రం నిర్ణయించుకోవడం మాత్రం శుభపరిణామం. సుమారు రూ.2,534 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా.. అమరావతిలో కేంద్ర సంస్థలన్నీ ఒకే చోటకు రానున్నాయి. అంటే ఇక కేంద్ర కార్యకలాపాలు కూడా అమరావతి నుంచి ప్రారంభం కానున్నాయి అన్నమాట. చట్టబద్ధతతో పూర్తి రక్షణ కల్పించిన కేంద్రం.. ఇప్పుడు నేరుగా రాజధానిలో కేంద్ర సమూహాలన్నీ ఒకే చోట చేర్చడం మాత్రం గొప్ప విషయం.

### ఇప్పటి పరిస్థితులు ఉంటాయా

ఇప్పుడు ఎలాగో.. అప్పుడు అలానే బిల్లు పెట్టి మార్చేస్తానని జగన్మోహన్ రెడ్డి చాలా సులువుగా చెబుతున్నారు. కానీ రాజధానిని మార్చడం అంత సులువు కాదు. ఎందుకంటే రాజధాని అనేది కేవలం ఒక కార్యాలయం కాదు. అది ఒక వ్యవస్థ. పార్లమెంట్ ఒకసారి రాజధాని నోటిఫై చేసిన తర్వాత దానిని మార్చడం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో దాదాపు అసాధ్యం. ఒకవేళ మార్చాలనుకున్నా మళ్లీ పార్లమెంట్ ఆమోదం కావాలి. ప్రస్తుత రాజకీయాల్లో అది అంత సులభం కాదు. ఎందుకంటే చేసేది మంచి పని ఉండాలి. ప్రజల ఆమోదం పొంది ఉండాలి. అమరావతి రాజధానికి ఏపీ ప్రజల ఆమోదం ఉంది. అన్నింటికీ మించి రాజకీయ సమీకరణలు కలిసి వచ్చాయి. అందుకే అమరావతి ఏకైక రాజధానికి చట్టబద్ధత లభించింది. అయితే జగన్మోహన్ రెడ్డి ఇంకా మొండిగా ముందుకు వెళితే ఆయనకు పొలిటికల్ డామేజ్ ఖాయం. టిడిపికి తిరుగులేని శక్తి గా మారడం అంతకంటే వాస్తవం.

### రెండు విభాగాలుగా నిర్మాణం...

కేంద్ర ప్రభుత్వం అమరావతిలో చేపట్టబోయే ఈ ప్రాజెక్టును రెండు విభాగాలుగా విభజించింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన వివిధ విభాగాల కార్యాలయాల కోసం రూ.1299 కోట్లు కేటాయించగా.. అక్కడ పనిచేసే ఉద్యోగుల నివాస వసతుల కోసం మరో రూ.1234.91 కోట్లు కేటాయించనున్నారు. ఇప్పటికే రాజధాని ప్రాంతా అభివృద్ధి ప్రాధికార సంస్థ 22.53 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందులో పాలనా సౌధం కోసం ఏకంగా 5.53 ఎకరాలు కేటాయించారు. మిగిలిన 17 ఎకరాల్లో అత్యాధునిక బహుళ అంతస్తుల నివాస సముదాయాలు నిర్మించనున్నారు.

### నేరుగా కేంద్ర నిధులు..

కేవలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెక్ చెప్పేందుకే అమరావతికి చట్టబద్ధత కల్పించారన్నది ప్రధాన వాదన. కానీ ఈ చట్టబద్ధతతో కేంద్ర సాయం, నిధుల విడుదల, విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మాణానికి కేంద్రం సాయం చేస్తుంది. గతంలో అమ రావతిని రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే నోటిఫై చేసింది. కేంద్ర గెజిట్లో అది పూర్తిస్థాయిలో లేదు. అయితే ఇప్పుడు పార్లమెంటు ద్వారా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2026 అమలులోకి రావడంతో.. అమరావతికి కేంద్ర ప్రభుత్వ నిధులు నేరుగా పొందే అవకాశం లభించింది. వరల్డ్ బ్యాంకు తో పాటు ఏసియన్ డెవలప్మెంట్ బ్యాంకు వంటి సంస్థల నుండి వస్తున్న సుమారు 26 వేల కోట్ల రూపాయలకు ఈ గెజిట్ నోటిఫికేషన్ ఒక బలమైన గ్యారెంటీగా పనిచేయనుంది.

### అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్..

మరోవైపు ఈ ప్రాజెక్టులో భాగంగా ఆధ్వర్యంలో 10 ఎకరాల్లో ఒక అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్ కూడా నిర్మించనున్నారు. ప్రపంచ స్థాయి సదస్సులు, గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీటింగ్ నిర్వహించుకునేలా దీనిని రూపొందించనున్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలోకి రానుండడం అమరావతికి కొత్త శోభ రానుంది. దేశ రాజధాని ఢిల్లీ బయట ఒక మోడ్రన్ పవర్ సెంటర్ గా అమరావతిని నిలబెట్టాలన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచనగా తెలుస్తోంది.

# జగన్ మావిగన్

(ఓకే తెలుగున్యూస్)

నలుగురికి నచ్చినది.. నాకు అసలు నచ్చదు.. ఇది మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి వైఖరి. అమరావతి రాజధాని విషయంలో ఆయన అనుసరించిన వైఖరి అందరికీ తెలిసినదే. అయితే ఇప్పుడు అదే అమరావతికి పార్లమెంటులో చట్టబద్ధత కల్పిస్తే.. ఇప్పుడు సరికొత్త కామెడీ మొదలుపెట్టారు జగన్మోహన్ రెడ్డి. సోషల్ మీడియా మీమ్స్, ట్రోల్స్ కు కావాల్సినంత మెటీరియల్ అందించారు. పార్లమెంట్ సమావేశాలకు సమాంతరంగా ప్రెస్ మీట్ పెట్టి కొత్త కొత్త అంశాలను ప్రకటించారు. ఇప్పటివరకు మూడు రాజధానులు అని చెప్పిన ఆయన.. ఇప్పుడు కొత్తగా మరో రాజధాని కట్టాలని ప్రతిపాదించారు. మచిలీపట్నం- విజయవాడ- గుంటూరు వరకు కొత్త రాజధానిని ప్రకటించాలని.. దానికి  అని పేరు పెట్టాలని కూడా సూచించారు. దీనికి మావి గన్ అని ఎందుకు పెట్టాలని సూచించారంటే.. జగన్ చెప్పినది వింటే మైండ్ బ్లాక్ అవుతుంది. మచిలీపట్నంలో మొదటి రెండు అక్షరాలు.. విజయవాడలోని మొదటి రెండు అక్షరాలు.. గుంటూరులోనే మొదటి మూడు అక్షరాలు కలిపి ఈ పేరు పెట్టాలట.

### ఎప్పటికప్పుడు మాటలు మారుస్తూ..

అమరావతిని నిర్వీర్యం చేసింది జగన్మోహన్ రెడ్డి. సర్వనాశనం చేసింది కూడా ఆయనే. సొంత రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసింది కూడా ఆయనే. అమరావతికి చట్టబద్ధత వస్తుంటే అదే రోజు ప్రెస్ మీట్ పెట్టి విషం చిమ్మారు అంటే ఏమనాలి. అమరావతిలో అవినీతి అంటూ కొత్త విషయాలు చెప్పలేదు. పాత ఖర్చులు మాటే మళ్లీ బయటపెట్టారు. గంటల తరబడి మాట్లాడిన ఆయన తాము అధికారంలోకి వస్తే అమరావతి నే కొనసాగిస్తామన్న మాట మాత్రం చెప్పలేదు. పైగా మావిగన్ అంటూ కొత్త పదం జత చేసి.. మచిలీపట్నం నుండి విజయవాడ వరకు రాజధాని విస్తరించాలని కొత్త సూచన చేశారు. ఆయనేదో ఇప్పుడు చట్టబద్ధత అవుతుంది కాబట్టి దానికి విరుగుడుగా ఈ వ్యాఖ్యలు చేశారు. మరి అదే ఆలోచన ఉండి ఉంటే తాను అధికారంలో ఉన్నప్పుడు చేసి చూపించవచ్చు కదా. ఐదేళ్లపాటు పూర్తి చేసి ఉంటే అందరూ హర్షించేవారు కదా. ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి నిర్మాణాత్మకమైన సలహాలు ఇవ్వాలి తప్ప. చిన్నపిల్లలు మాదిరిగా మాట్లాడుతున్నారు జగన్మోహన్ రెడ్డి. ఆయన ప్రజలను గొర్రెల్లా చూస్తున్నారు. అచ్చం వైయస్సార్ కాంగ్రెస్ శ్రేణులు మాదిరిగా ప్రజలు కూడా ఉంటారని ఒక నిర్ణయానికి వచ్చినట్టు ఉన్నారు. అందుకే ఇలా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు.



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాద్ వెళ్లారు. ఎందుకో తెలుసా? ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయం ఎదుట ధర్నా చేయడానికి. ఎందుకో తెలుసా? ఆర్కే వీకెండ్ కామెంట్లో జగన్మోహన్ రెడ్డిని విమర్శించినందుకు. అయితే జగన్ పై ఆర్కే విమర్శలు కొత్త కాదు. ఎందుకంటే వీకెండ్ కామెంట్ జగన్మోహన్ రెడ్డి గురించి ఎక్కువగా ఉంటుంది. అయితే ఈసారి మాత్రం జగన్మోహన్ రెడ్డికి కోపం తెప్పించినట్టుంది ఆర్కే విశ్లేషణ. అందుకే ధర్నాలు చేయాలని పార్టీ నేతలకు ఆదేశించినట్టు ఉన్నారు. ఏపీలో వద్దు హైదరాబాదులోని ఏబీఎన్ ఆఫీసు ముందు ధర్నా చేయాలని సూచించినట్టు ఉన్నారు. అందుకే హైదరాబాద్ లో ఈరోజు పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు. అయితే ఈ పరిణామంతో ఏబీఎన్ ఆంధ్రజ్యోతికి ఎంతో ప్రయోజనం. ఎందుకంటే పాపులారిటీతో పాటు దండిగా వ్యూయర్షిప్ ఉంటుంది. అంతకంటే రాధాకృష్ణకు కావాల్సింది ఏముంది?







# సాక్షిని ఏంచేయాలి

**ఏబీఎన్ ఆంధ్రజ్యోతిపై వైసీపీ యుద్ధం**

**వీకెండ్ కామెంట్ లో రాధాక్రిష్ణ వ్యాఖ్యలపై ఆగ్రహం**

**అలా అయితే ప్రతిరోజూ సాక్షిని శిక్షించాల్సిందే**

**వైసీపీ తీరుపై రాష్ట్ర వ్యాప్తంగా ఇదే చర్చ**

(ఓకే తెలుగున్యూస్)

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఏబీఎన్ కార్యాలయం ముందు ధర్నా చేయడం.. దానిపై నిరంతరాయంగా ఏబీఎన్ కథనాలు ప్రచురించడం జరిగిపోయింది. అయితే ఆర్కే పదునైన మాటలతో ఈ వీకెండ్ కామెంట్ కొనసాగింది. జగన్మోహన్ రెడ్డిని గుడ్డిగా నమ్మడం పై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై ఘాటు విమర్శలు చేశారు ఆర్కే. జగన్ నంది అంటే నంది.. పంది అంటే పంది అని నమ్మే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు.. చివరకు సొంత కుటుంబ సభ్యుల విషయంలో సైతం జగన్మోహన్ రెడ్డి ఏది చెబితే అది నమ్మేస్తారని తన వీకెండ్ కామెంట్లో రాసుకోవచ్చారు ఆర్కే. దీంతో మహిళలు అనే పాయింట్ తీసుకొని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి పై దండయాత్ర చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు ఆర్కె. అయితే తానా మహిళలను విమర్శించింది.. అంటూ మైండ్ బ్లాక్ అయ్యేలా కథనాలు ప్రచురిస్తోంది ఏబీఎన్ ఆంధ్రజ్యోతి. ఎలా? ఎక్కడ? అవమానించారో కూడా వివరణాత్మక కథనాలు ప్రచురిస్తోంది ఏబీఎన్.

***రామోజీరావు పై ఇదే మాదిరిగా..***

రామోజీరావు విషయంలో ఇలాంటి పగటి కలలే కన్నారు జగన్మోహన్ రెడ్డి. ఒక్క రోజు అయినా జైల్లో వేయాలని చూసారు. కానీ అది వీలుపడలేదు. చివరకు పోలీసులు వెళ్లి రామోజీరావు ఇంట్లోనే ఆయనను దర్యాప్తు చేశారు. అంతకుమించి ఏమీ చేయలేకపోయారు. ఇదే ఆంధ్రజ్యోతి రాధాకృష్ణపై దేశద్రోహం కేసు కూడా పెట్టాలని చూసారు. అది వీలుపడలేదు. అయితే ఇప్పుడు పార్టీ నేతలతో బలవంతంగా హైదరాబాదులోని ఆంధ్రజ్యోతి కార్యాలయం ఎదుట ధర్నా చేయించారు. ఈరోజు స్వయంగా జగన్మోహన్ రెడ్డి రాధాకృష్ణను స్టేషన్లకు తిప్పుతానని హెచ్చరించారు. సైలెంట్ గా రివెంజ్ తీర్చుకోవాలి తప్ప.. ఇలాంటి మాటలు ఎంత మాత్రం ఉపకరించవు. ఇంకా మూడేళ్ల పాటు కూటమి అధికారంలో ఉంటుంది. బహుశా తన సొంత మీడియా ఉంది కాబట్టి ఇలాంటి మాటలు చెప్పి ఉండవచ్చు. కానీ ఆంధ్రజ్యోతి ఎప్పుడు తనతో పాటు తన పార్టీకి వ్యతిరేకం అనే విషయాన్ని గుర్తించాలి. పైగా స్టేషన్లను తిప్పుతాను అంటూ చెప్పడం చూస్తుంటే.. జగన్లో ఉండే ఫ్రస్టేషన్ ఇట్టే బయటపడుతుంది.

**రాధాకృష్ణ పై రగిలిపోతున్న జగన్**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి భారీ శపథం చేశారు. అధికారంలోకి వచ్చిన మరుక్షణం ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండి వేమూరి రాధాకృష్ణను పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పిస్తానని హెచ్చరించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైసిపి సమన్వయ సమావేశంలో జగన్మోహన్ రెడ్డి తన మావిగన్ తో పాటు ఆంధ్రజ్యోతి ఎండి ఎపిసోడ్ పై మాట్లాడారు. వైయస్సార్ కుటుంబ మహిళలపై అలా మాట్లాడుతారా.. అటువంటి వ్యాఖ్యలు చేస్తారా.. అనే కంటెంట్ చుట్టూ జగన్మోహన్ రెడ్డి కామెంట్స్ సాగాయి. ఎట్టి పరిస్థితుల్లో రాధాకృష్ణను విడిచి పెట్టేది లేదని కూడా తేల్చి చెప్పారు. అయితే ఒకసారి గతాన్ని పరిశీలిస్తే జగన్ తండ్రి రాజశేఖర్ రెడ్డి ఓ ఆరేళ్ల పాటు అధికారంలో ఉండేవారు. జగన్మోహన్ రెడ్డి సైతం ఐదేళ్లు అధికారంలో ఉన్నారు. కానీ ఆంధ్రజ్యోతి రాధాకృష్ణను మాత్రం టచ్ చేయలేకపోయారు.

**ఖండించాలి తప్ప..**

సాధారణంగా మీడియా సంస్థల ముందు ధర్నాలు చేయకూడదు. చెడులను ఖండించాలి తప్ప. అలా అయితే సాక్షి కార్యాలయాలను రోజూ ధ్వంసం చేయాలి. వాస్తవానికి ఆర్కే వీకెండ్ కామెంట్ అనేది న్యూస్ కాదు. అది ఆయన వ్యక్తిగత అభిప్రాయం. దానిపై వేరే అభిప్రాయం ఉంటే ఖండించాలి. పోనీ సొంత మీడియా ఉంది కదా సాక్షిలో అటువంటివి చేయొచ్చు కదా అంటే.. కుదిరే పని కాదన్నట్టు కనిపిస్తున్నారు. వీకెండ్ కామెంట్ ఆర్కే రాస్తోంది ఇప్పుడే కాదు.. జగన్మోహన్ రెడ్డిని విమర్శిస్తోంది ఇప్పుడే కాదు.. చాలా రోజులుగా రాధాకృష్ణ అదే పనిగా విమర్శిస్తున్నారు. అప్పుడు లేని కోపం ఇప్పుడు ఎందుకు. అనవసరంగా పనిగట్టుకుని హైదరాబాద్ వెళ్లడం ఎందుకు. అది ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, రాధాకృష్ణకు ప్రచారం కల్పించడమే అవుతుంది. అందులో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వచ్చినది ఏమీ ఉండదు.

**ప్రభుత్వంపై వ్యతిరేక కథనాలతోనే..**

రాధాకృష్ణ ఒక మీడియాను నడుపుతున్నారు. ఆంధ్రజ్యోతితో పాటు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఛానల్ ను నడుపుతున్నారు. ఒక విధంగా చెప్పాలి అంటే ఆంధ్రజ్యోతి 2004 తర్వాత విశ్వరూపం చూపింది. 2001లోనే ఆంధ్రజ్యోతి సంస్థను దక్కించుకున్నారు రాధాకృష్ణ. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వ్యతిరేక మీడియా గానే ముద్ర ఉండేది. అలా 2014 వరకు ఆంధ్రజ్యోతి ప్రభుత్వ వ్యతిరేక ముద్ర మూటగట్టుకుంది. 2014 నుంచి 2019 మధ్య చంద్రబాబు అధికారంలో ఉన్నారు. 2019 నుంచి 2024 మధ్య జగన్ ఉన్నారు. 2024లో చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. అంటే ఎక్కువ కాలం ఆంధ్రజ్యోతిని వ్యతిరేకించే ప్రభుత్వాలు ఉండేవి. అప్పుడే ఏం చేయలేకపోయాయి. మళ్లీ ఇప్పుడు జగన్ అధికారంలోకి రావాలి. ఆంధ్రజ్యోతి తప్పులను వెతకాలి. రాధాకృష్ణ ను పోలీస్ స్టేషన్లలో తిప్పాలి.





# ముహూర్తం ఫిక్స్

**28న విశాఖలో గూగుల్ డేటా సెంటర్ కు శంకుస్థాపన**

(ఓకే తెలుగున్యూస్)

ఏపీలో మరో భారీ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపనకు ముహూర్తం ఫిక్స్ అయ్యింది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణం చేపట్టనున్న సంగతి తెలిసిందే. ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ ఇది. దాదాపు 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో దీనిని నెలకొల్పనున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం గూగుల్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. భూముల కేటాయింపు ప్రక్రియ కూడా పూర్తయింది. ఈ తరుణంలో ఈ నెల 28న ఇందుకు సంబంధించిన శంకుస్థాపన జరగనుంది. సీఎం చంద్రబాబుతో పాటు మంత్రి లోకేష్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ హాజరుకానున్నారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణం జరిగితే అనుబంధంగా చాలా రకాల పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంది.

**మూడు చోట్ల భూములు..**

విశాఖలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మూడు చోట్ల 600కు పైగా ఎకరాల భూమిని కేటాయించింది. మరో రెండేళ్లలో అంటే 2028 జూలై నాటికి ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్, అదానీ ఇన్ఫ్రా భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరగనుంది. ఏపీఐఐసీ తర్లువాడ లో 38 ఎకరాలను సేకరించింది. అందులో ఇటీవల 266.6 ఎకరాలను గూగుల్ కు కేటాయించింది. ఇలా కేటాయించిన భూముల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. శంకుస్థాపన కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ హాజరుకానున్నారు. ఆయా భూములను చేరుకునేందుకు అవసరమైన రహదారి నిర్మాణాన్ని రెండు ప్యాకేజీల్లో చేపడుతున్నారు.తర్లువాడలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్ కోసం అవసరమైన పర్యావరణ అనుమతికి ఇప్పటికే గూగుల్ సంస్థ దరఖాస్తు చేసుకుంది. వైజాగ్ మెగా డేటా పార్క్ లిమిటెడ్ పేరుతో బిల్డింగ్ ప్లాన్ సమర్పించారు. మొత్తం 1.43 లక్షల చదరపు మీటర్లలో బిల్డప్ ఏరియాగా అందులో చూపించారు. ఇందులో పార్కింగ్ ప్లేస్ 33% కాగా.. గ్రీన్ బెల్ట్ కు 59.91 ఎకరాలు కేటాయించారు.మరోవైపు మొత్తం తర్లువాడలో 266 ఎకరాలు.. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో 174 ఎకరాలు... అడవివరంలో 166 ఎకరాలు కేటాయించారు.విశాఖలో ఈ భారీ ప్రాజెక్టుతో దేశమే కాదు ప్రపంచం సాగరనగరం వైపు చూసే అవకాశం ఉంది.





# ఆట మొదలు

**మాజీ మంత్రి రోజా, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి చుట్టూ ఉచ్చు**

**ఆడుదాం ఆంధ్ర అవినీతిపై ప్రభుత్వం ఫోకస్**

**ఇద్దరు నేతల అరెస్టు తప్పదా?**

(ఓకే తెలుగున్యూస్)

ఏపీలో కొత్త కేసు తెరపైకి రానుంది. అయితే ఇది పాత కేసు. కానీ సరికొత్త ఆధారాలతో ఇద్దరు నేతలపై పట్టు బిగించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఆడుదాం ఆంధ్ర పేరిట క్రీడా పోటీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఆటల నిర్వహణ అప్పట్లో అవినీతిమయంగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. నాసిరకం క్రీడా కిట్లు, ఇష్టారాజ్యంగా ఆటల పోటీల నిర్వహణ, వైసిపి అభిమానులనే విజేతలుగా ప్రకటించడం.. ఇలా భారీ అవకతవకలు చోటు చేసుకున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆడుదాం ఆంధ్ర పై విచారణ మొదలు పెట్టింది. విజిలెన్స్ విచారణ తుది దశకు చేరుకుంది. ఇప్పుడు దీనిపై సిఐడి లేదా ఏసీబీకి కేసు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాలు కదుపుతోంది. తద్వారా మాజీ మంత్రి ఆర్కే రోజా, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి చుట్టూ ఇప్పుడు ఉచ్చు బిగుస్తోంది.

**నిధుల దుర్వినియోగం**

వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దాదాపు 47 రోజులపాటు ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహించారు. అప్పట్లో భారీ ఎత్తున నిధులు దుర్వినియోగం అయినట్లు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం గుర్తించింది. ఈ కార్యక్రమం కోసం ఏకంగా రూ.125 కోట్లు వరకు ఖర్చు చేయగా.. అందులో రూ.40 కోట్ల నుంచి రూ.60 కోట్ల వరకు అవకతవకలు జరిగినట్లు ప్రాథమిక సమాచారం. దీనిపై విజిలెన్స్ అధికారులు సుదీర్ఘ విచారణ జరిపి వేల పేజీల నివేదికను సిద్ధం చేశారు. ఈ నివేదికలో అప్పటి క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజా, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పాత్ర పై కీలక ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది.

**నాసిరకం కిట్లు..**

ప్రధానంగా వివిధ క్రీడాంశాలకు సంబంధించి నాసిరకం స్పోర్ట్స్ కిట్లను సరఫరా చేసి భారీగా నిధులు గోల్మాల్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. బ్రాండెడ్ కంపెనీల స్టిక్కర్లను వాడి.. అత్యంత నాణ్యతలేని బ్యాట్లు, బంతులు, టీ షర్టులు సరఫరా చేసినట్లు అధికారులు నిర్ధారించారు. పంపిణీ చేయాల్సిన కిట్లను పక్కదారి పట్టించడం.. ప్రైజ్ మనీని విజేతలకు అందకుండా అడ్డుకోవడం వంటి అంశాల్లో భారీ అక్రమాలు జరిగినట్లు విచారణలో తేలింది. కొన్ని జిల్లాల్లో కలెక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా అదనపు నిధులు కేటాయించినట్లు విజిలెన్స్ విచారణలో గుర్తించారు. ఈ వ్యవహారంలో ప్రజాధనం ఏ విధంగా పక్కదారి పట్టిందో గణాంకాలతో సహా నివేదికలో పొందుపరిచారు. ప్రధానంగా మంత్రి రోజా, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కి అవినీతిలో ఎక్కువ భాగం ఉన్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం.

**కేసులతో సిద్ధం..**

అయితే విజిలెన్స్ విచారణ పూర్తి అయి.. నివేదిక ప్రభుత్వానికి అందింది. దీని ఆధారంగా చేసుకుని మాజీ మంత్రి రోజాతో పాటు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. త్వరలో ఈ కేసును ఏసీబీకి లేదా సిఐడికి అప్పగించే ఛాన్స్ కనిపిస్తోంది. విజిలెన్స్ వివరాలు పక్కాగా ఉంటే మాత్రం ఈ కేసులో అరెస్టులు తప్పవనే ప్రచారం రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. అయితే ఇప్పుడు ఆడుదాం ఆంధ్ర అవినీతి బయటపడడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

**దెబ్బతిన్న క్రీడా స్ఫూర్తి..**

మరోవైపు ఆడుదాం ఆంధ్రాలో కేవలం ఆర్థికపరమైన అవినీతి మాత్రమే లేదు. అప్పట్లో విజేతలుగా వైసిపి శ్రేణులను చూపి భారీగా నిధులు పక్కదారి పట్టించారన్న ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో క్రీడాధికారులు ప్రమేయం లేకుండా.. అసలు సిబ్బందితో కాకుండా వలంటీర్లతో క్రీడా పోటీలు నిర్వహించారన్న విమర్శ ఉంది. క్రీడా స్ఫూర్తిని దెబ్బతీస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలని విజేతలుగా ఎంపిక చేసినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే అప్పట్లో ఈ కార్యక్రమాన్ని వాడుకున్నట్లు విచారణలో తేలింది.

# ఏసీబీకి చిక్కిన శాంతి

**ఆరేళ్లలో కోట్ల అక్రమ సంపాదన**

**వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా..**

**వివాదాస్పద దేవాదాయ శాఖ అధికారిణి అరెస్టు**

(ఓకే తెలుగున్యూస్)



మరోసారి దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆమెను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఆదాయానికి మించిన ఆస్తులకు సంబంధించిన కేసులో ఆమె అరెస్టు అయ్యారు. కోర్టు రిమాండ్ విధించడంతో ఆమెను జైలుకు తరలించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ గా ఉన్న శాంతి వ్యవహారాలు బయటకు వచ్చాయి. అప్పట్లోనే వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తో ఆమెకు ఉన్న సంబంధాలపై రకరకాల రచ్చ నడిచింది. సవాళ్లు, ప్రతి సవాళ్లు కొనసాగాయి. ఆమెపై సస్పెన్షన్ వేటు పడింది. గత కొన్నేళ్లుగా కొనసాగుతూ వస్తోంది. అయితే ఇప్పుడు ఏసీబీ దాడులు ఏకకాలంలో జరగగా.. ఆదాయానికి మించిన ఆస్తులతో ఆమె పట్టుబడ్డారు. దీంతో ఆమె అరెస్ట్, రిమాండ్ చకచకా జరిగిపోయాయి.

**ఆరేళ్ల క్రితం దేవాదాయ శాఖలోకి..**

2020లో దేవాదాయ శాఖలో ప్రవేశించారు శాంతి. విజయవాడతో పాటు విశాఖపట్నంలో విధులు నిర్వర్తించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో శాంతి ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే కూటమి వచ్చిన తర్వాత ఆమెను విధుల్లో నుంచి సస్పెండ్ చేశారు. గత నెలలోనే ఆమె సస్పెన్షన్ తొలగింది. పోస్టింగ్ కోసం ఆమె ఎదురు చూస్తూ వచ్చారు. అయితే ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు మంగళవారం ఏకకాలంలోని నాలుగు ప్రాంతాల్లో సోదాలు చేశారు. అయితే కోట్లాది రూపాయల ఆస్తులను గుర్తించడంతోపాటు నేరారోపణలకు దారి తీసే కీలకపత్రాలను సైతం స్వాధీనం చేసుకున్నారు. ఆమెకు విశాఖపట్నంలో ఒక నివాస ఫ్లాట్, తాడేపల్లి కంచనపల్లి లో ఒక జిం 2 భవనం, సుమారు 770 గ్రాముల బంగారం ఆభరణాలు, దాదాపు 3 కిలోల వెండి వస్తువులు,రూ.1.15 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో సుమారు రూ. 2.84 లక్షలు, ఒక వోక్స్ వ్యాగన్ పోలో కారు, ఒక మోటార్ సైకిల్, వివిధ ఎలక్ట్రానిక్ పరికరాలు వంటి ఆస్తులు గుర్తించారు. శాంతిని అరెస్టు చేసిన అధికారులు మంగళవారం రాత్రి విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు. ఈనెల 21 వరకు ఆమెకు రిమాండ్ విధించారు న్యాయమూర్తి. దీంతో విజయవాడ జైలుకు తరలించారు.

**భారీగా సంపాదన..**

అయితే దేవాదాయ శాఖలో విధుల్లో చేరిన ఆరేళ్లకే కోట్లాది రూపాయల సంపాదన పెరగడం విశేషం. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఈమె తీరు వివాదాస్పదంగా మారింది. వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి పేరు కూడా ఆమె వివాదాల్లో వచ్చింది. దానిపై సవాళ్లు కూడా నడిచాయి. ఆమె తన తొలి భర్తకు విడాకులు ఇచ్చి రెండో పెళ్లి చేసుకున్నారని కూడా సమాచారం. ఓ మామూలు అధికారిగా ఉంటూ హెలికాప్టర్లలో, ప్రత్యేక విమానాల్లో తిరిగేవారని ఆరోపణలు వచ్చాయి. గతంలో విధుల్లో ఉన్నప్పుడు ఉన్నతాధికారిపై ఇసుక విసిరి అనుచితంగా ప్రవర్తించారని ఆరోపణలు ఉన్నాయి. ఆమె తీరుతో ఆయన సెలవులోకి వెళ్లిపోయారని కూడా అప్పట్లో ప్రచారం నడిచింది. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆమె పూర్తిగా కష్టాల్లో కూరుకు పోయారు. ఇప్పుడు ఏకంగా జైలు పాలయ్యారు

# అప్పుడు బీటీ.. ఇప్పుడు వీబీ

## పార్టీనే నమ్ముకున్న వాళ్లకు గుండు సున్నా

» అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ లో రాజకీయ సెగలు
» కొత్తవాళ్లు వస్తున్న నేపథ్యంలో ప్రధాన పార్టీలలో జడలు విప్పుతున్న అసంతృప్తి
» వచ్చే ఎన్నికల్లో ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపిస్తాయని చెబుతున్న రాజకీయ విశ్లేషకులు




**ముందు వచ్చిన చెవుల కంటే.. వెనుక వచ్చిన కొమ్ములు వాడి అంటారు. మిగతా రంగాలలో ఏమోగానీ.. రాజకీయాల్లో మాత్రం ఈ సామెత నూటికి నూరు శాతం సరిపోతుంది. అధికారంలోకి రాకముందు పార్టీలు మొత్తం ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడతాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం ఆ అధికారాన్ని మరింత సుస్థిరం చేసుకోవడానికి తాపత్రయపడతాయి. ఇందులో ఆ పార్టీ.. ఈ పార్టీ అని తేడా లేదు.. అన్ని అలానే ఉన్నాయి. రాజకీయాలలో స్వప్రయోజనాలు మాత్రమే ఉంటాయి. అందుకోసమే పార్టీలు రకరకాల ఎత్తులు వేస్తుంటాయి. కొన్ని సందర్భాలలో తలవంచుతాయి.. ఇంకా కొన్ని సందర్భాలలో తల ఎగరేస్తాయి. అంతిమంగా కావాల్సింది అధికారం. ఇక్కడ ప్రజాస్వామ్యం అనే మాటకు ఆస్కారం లేదు. విలువలు అనే మాటకు విలువలేదు. వలువలు వదిలేసిన తర్వాత విలువలు అనే మాటకు అర్థం లేదు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం రాజకీయ పార్టీల వ్యవహార శైలి పై ఉపోద్ఘాతానికి నూటికి నూరు శాతం సరిపోతుంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎన్నికలకు ముందే వాతావరణాన్ని వేడెక్కించాయి. గులాబీ పార్టీలో ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా చేసుకుంటే.. కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తులను గులాబీ పార్టీ టార్గెట్ గా చేసుకుంది. దీంతో ఇన్నాళ్లపాటు ఆయా పార్టీలలో పనిచేసిన వారంతా మధనపడుతున్నారు. కొత్త వాళ్లు వస్తే.. మాకు అవకాశాలు ఎవరిస్తారని ప్రశ్నిస్తున్నారు. అయితే పాత వాళ్లకు రెండు పార్టీలు కూడా ప్రయారిటీ ఇవ్వడం లేదు. స్థూలంగా చెప్పాలంటే పాత వాళ్లంతా జెండా కూలీలు గానే మిగిలిపోయారు.**




**అప్పుడు ఇతర పార్టీలకు సంబంధించిన ఎమ్మెల్యేలు గులాబీ పార్టీలో చేరుతున్నప్పుడు.. రకరకాల విమర్శలు వచ్చాయి. నాడు అధికారం ఉంది కాబట్టి వాటిని కేసీఆర్ తొక్కిపెట్టారు. ఒరిజినల్ తెలంగాణ కాకుండా.. బంగారు తెలంగాణ బ్యాచ్ హవా పెరిగిపోయిందని అప్పట్లో విమర్శలు వచ్చాయి. అయినప్పటికీ వాటిని కెసిఆర్ పట్టించుకోలేదు. పైగా సొంత మీడియాలో రాజకీయ పునరేకీకరణ అనే కోణంలో కథనాలు రాయించారు. అప్పట్లో కెసిఆర్ మీడియా మీద ఉక్కు పాదం మోపడంతో.. తెలంగాణలో ప్రశ్నించే గొంతుక లేకుండా పోయింది.**

---

**2023 లో అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత గతంలో తనకు ఎదురైన అనుభవానికి గట్టి రివెంజ్ తీర్చుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావించారు. అందులో భాగంగానే గులాబీ పార్టీలో గెలిచిన కొంతమంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. దీనిని బిఆర్ఎస్ నేతలు విమర్శించారు. సుప్రీంకోర్టు దాకా వెళ్లారు. అనేక సందర్భాల్లో విచారణ పూర్తయిన తర్వాత సుప్రీంకోర్టు ఈ అంశాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లింది. స్పీకర్ ఎలాగూ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వ్యక్తి కాబట్టి.. ఆ పార్టీకి అనుకూలంగానే నిర్ణయం తీసుకున్నారు. మొత్తంగా గులాబీ పార్టీ ఈ వ్యవహారంలో ఏదో చేయబోయి.. తనే విమర్శల పాలైంది.**

### గొప్పగా చెప్పుకునే సీట్లు రాలేదు

తెలంగాణ రాష్ట్రంలో 2014లో జరిగిన ఎన్నికల్లో నాటి తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చింది.. అప్పుడు ఆ పార్టీకి గొప్పగా చెప్పుకునే సీట్లు రాలేదు. దీంతో ఆపరేషన్ ఆకర్ష్ కు తెరలేపింది. టిడిపి నుంచి మొదలు పెడితే కాంగ్రెస్ పార్టీ వరకు అందరూ ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకుంది. చివరికి కమ్యూనిస్టు పార్టీని కూడా వదిలిపెట్టలేదు. నాడు ఈ పరిణామాన్ని గులాబీ పార్టీ రాజకీయ పునరేకీకరణ అని చెప్పింది. అంతేకాదు 2018 లో జరిగిన ఎన్నికల్లోను ఇతర పార్టీల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకుంది గులాబీ పార్టీ. పైగా వారికి మంత్రి పదవులు కూడా ఇచ్చింది.. నాడు కూడా కేసీఆర్ దానిని రాజకీయ పునరేకికరణ అని చెప్పారు.

### రకరకాల విమర్శలు

అప్పుడు ఇతర పార్టీలకు సంబంధించిన ఎమ్మెల్యేలు గులాబీ పార్టీలో చేరుతున్నప్పుడు.. రకరకాల విమర్శలు వచ్చాయి. నాడు అధికారం ఉంది కాబట్టి వాటిని కేసిఆర్ తొక్కిపెట్టారు. ఒరిజినల్ తెలంగాణ కాకుండా.. బంగారు తెలంగాణ బ్యాచ్ హవా పెరిగిపోయిందని అప్పట్లో విమర్శలు వచ్చాయి. అయినప్పటికీ వాటిని కెసిఆర్ పట్టించుకోలేదు. పైగా సొంత మీడియాలో రాజకీయ పునరేకీకరణ అనే కోణంలో కథనాలు రాయించారు. అప్పట్లో కెసిఆర్ మీడియా మీద ఉక్కు పాదం మోపడంతో.. తెలంగాణలో ప్రశ్నించే గొంతుక లేకుండా పోయింది.





### కొంతమంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు

2023 లో అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత గతంలో తనకు ఎదురైన అనుభవానికి గట్టి రివెంజ్ తీర్చుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావించారు. అందులో భాగంగానే గులాబీ పార్టీలో గెలిచిన కొంతమంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. దీనిని బిఆర్ఎస్ నేతలు విమర్శించారు. సుప్రీంకోర్టు దాకా వెళ్లారు. అనేక సందర్భాల్లో విచారణ పూర్తయిన తర్వాత సుప్రీంకోర్టు ఈ అంశాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లింది. స్పీకర్ ఎలాగూ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వ్యక్తి కాబట్టి.. ఆ పార్టీకి అనుకూలంగానే నిర్ణయం తీసుకున్నారు. మొత్తంగా గులాబీ పార్టీ ఈ వ్యవహారంలో ఏదో చేయబోయి.. తనే విమర్శల పాలైంది.

### ఒత్తిడి వాతావరణాన్ని ఎదుర్కొంటున్నాయి

అటు కాంగ్రెస్ పార్టీ.. ఇటు భారత రాష్ట్ర సమితి ఇప్పుడు తెలంగాణలో ఒక రకమైన ఒత్తిడి వాతావరణాన్ని ఎదుర్కొంటున్నాయి.. భారత రాష్ట్ర సమితి జగిత్యాల మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని చేర్చుకుంది. ఇది ఎల్ రమణలాంటి వాళ్లకు నచ్చడం లేదు. పైగా వచ్చే ఎన్నికల్లో జీవన్ రెడ్డికి టికెట్ ఇస్తామని గులాబీ పార్టీ పెద్దలనుంచి హామీ లభించినట్లు తెలుస్తోంది. అదే జరిగితే రమణ రాజకీయ భవిష్యత్తు మొత్తం నాశనమైనట్టే. అందువల్లే ఆయన జీవన్ రెడ్డి రాక పట్ల అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. మిగతా భారత రాష్ట్ర సమితి నాయకులు కూడా ఇదే ధోరణిలో ఉన్నట్టు సమాచారం. ఒకవేళ జీవన్ రెడ్డి కి ఒక టికెట్ ఇస్తే.. రమణ తన రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వేరే నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు కనిపిస్తోంది. కేవలం జగిత్యాలలోనే కాకుండా.. ఇంకా కొన్ని నియోజకవర్గాలలో భారత రాష్ట్ర సమితి ఆపరేషన్ ఆకర్ష కు తెర లేపినట్టు తెలుస్తోంది. అయితే అక్కడ ఉన్న గులాబీ పార్టీ నేతలు అంతర్మథనంలో పడుతున్నారని.. తమ రాజకీయ భవిష్యత్తు దృష్ట్యా వేరే నిర్ణయం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని వార్తలు వస్తున్నాయి.

### కాంగ్రెస్ పార్టీలో కూడా పరిస్థితి ఏమంత గొప్పగా లేదు

ఇక అధికార కాంగ్రెస్ పార్టీలో కూడా పరిస్థితి ఏమంత గొప్పగా లేదు. రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవిని ఆశిస్తున్నారు. అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ పార్టీని కడిగిపారేస్తున్నారు. ఎమ్మెల్సీ విజయశాంతి కూడా ప్రభుత్వ వైఖరి పట్ల తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారు. తన సేవలను పార్టీ వాడుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల శాసన మండలి లో విజయశాంతి సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ వ్యవహార శైలి సక్రమంగా లేదని.. ప్రభుత్వంలో కూడా సానుకూల దృక్పథం కనిపించడం లేదని మండిపడ్డారు. ఇంకా కొంతమంది నేతలు కూడా ప్రభుత్వ తీరు పట్ల ఆగ్రహంతో ఉన్నారు. మొత్తంగా చూస్తే అటు బిటి బ్యాచ్.. ఇటు వలస బ్యాచ్.. వల్ల రెండు ప్రధాన పార్టీలు శిరోభారాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈ భారం ఎంతవరకు సాగుతుంది.. వచ్చే ఎన్నికల్లో ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తుంది.. ఈ ప్రశ్నలకు త్వరలోనే సమాధానం లభిస్తుందని విశ్లేషకులు అంటున్నారు.

# బిట్ కాయిన్ రూపకర్త ఆడం బ్యాక్

» ఇన్నాళ్ల పరిశోధన తర్వాతే తెలిసిపోయింది » ప్రాణభయంతో వెలుగులోకి రావడానికి ఇబ్బంది

**(ఒకే తెలుగు, బిజినెస్ ప్రతినిధి)**

మార్కెట్ రంగ నిపుణులకు.. ముఖ్యంగా ఇన్వెస్ట్మెంట్.. వంటి విభాగాలలో పనిచేస్తున్న వారికి బిట్ కాయిన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇది ఒక రకమైన క్రిప్టో కరెన్సీ.. దీనిపై అనేక రకాల విమర్శలు.. ఆరోపణలు వచ్చినప్పటికీ ప్రపంచంలో చలామణి అవుతూనే ఉంది. కొన్ని దేశాలు దీనిని నిషేధిస్తే.. మరికొన్ని దేశాలు కార్యకలాపాలు సాగిస్తూనే ఉన్నాయి.

**క్రిప్టో కరెన్సీ**

బిట్ కాయిన్ అనేది క్రిప్టో కరెన్సీ. ఒక ముక్కల్లో చెప్పాలంటే కంటికి కనిపించని డబ్బు అన్నమాట. ఇదంతా కూడా ఒక మాయ ప్రపంచం. బిట్ కాయిన్ ద్వారా పెట్టుబడులు పెట్టేవారు.. లావాదేవీలు నిర్వహించేవారు కొన్ని సంవత్సరాలుగా.. అన్వేషణ సాగిస్తూనే ఉన్నారు. బిట్ కాయిన్ రూపొందించిన వ్యక్తి ఎవరో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు.. అయితే ఈ కరెన్సీ క్రియేటర్ గురించి న్యూయార్క్ టైమ్స్ ఒక కథనాన్ని ప్రచురించింది. అంతేకాదు పేరుని కూడా వెల్లడించింది.

**బ్రిటిష్ లో క్రిప్టాలజిస్ట్**

బిట్ కాయిన్ రూపొందించిన వ్యక్తి పేరు ఆడం బ్యాక్. ఇతడు బ్రిటిష్ లో క్రిప్టాలజిస్ట్ గా పనిచేస్తుంటాడు. కొన్ని నెలలపాటు నిరాటంకం గా జరిపిన దర్యాప్తులో ఈ విషయాన్ని గుర్తించారు.. బ్యాక్ క్రిప్టో కమ్యూనిటీని ఏర్పాటు చేశాడు.. తొలి రోజుల్లో అతడు అనేక రకాలుగా పరిశోధనలు చేశాడు. ఆ తర్వాత బిట్ కాయిన్ ను సృష్టించాడు.. అయితే ఇప్పటివరకు బిట్ కాయిన్ ను రూపొందించింది నకమోటో అని అందరూ అనుకున్నారు. అయితే అతడు పంపించిన ఈమెయిల్ పరిశీలిస్తే.. అసలు వివరాలు తెలిసాయి. అతడు ఉపయోగించిన ముద్రలు.. పంపించడం మెయిల్స్ ని బట్టి అవి బ్రిటన్ లేదా అమెరికా తూర్పు లేదా పశ్చిమ తీరానికి వెళ్లి ఉంటాయని గుర్తించారు. నకమోటో తన ఈ మెయిల్స్ లో కొన్ని పదాలకు బ్రిటిష్ అక్షరాలను ఉపయోగించేవాడు.. అందువల్లే నకమోటో బ్రిటన్ దేశానికి చెందిన వాడని గుర్తించారు. బ్యాక్ గతంలో ఆన్లైన్ లో వాడిన భాష కూడా నకమోటో ఉపయోగించిన భాషకు దగ్గరగా ఉంది. అందువల్లే అంతర్జాతీయ మీడియా ఈ కథనాన్ని ప్రచారం చేసింది

**31 వేల లైన్ల కోడ్ రూపొందించాడు**

నకమోటో ఏకంగా 31 వేల లైన్ల కోడ్ రూపొందించాడు. దానిద్వారా బిట్ కాయిన్ సృష్టించాడు.. అతడి సంతకం తో కూడిన బిట్కాయిన్ పి టి పి ఓ ఈ క్యాష్ పేపర్ 2008లో బయటికి వచ్చింది. ఆ పేపర్లో బ్యాక్ పేరు ప్రముఖంగా కనిపించింది. అప్పుడు నకమోటో బ్యాక్ ను కలిసినట్టు వార్తలు వచ్చాయి. దీంతో వారిద్దరూ వేరువేరు వ్యక్తులని ప్రచారం జరిగింది.. బిట్ కాయిన్



రూపకర్తను దాచిపెట్టడానికి ఈ నాటకం ఆడినట్టు తెలుస్తోంది.. అయితే బ్యాక్ ఈ వ్యవహారం మీద స్పందించాడని.. తాను నకమోటో కాదని చెప్పాడని తెలుస్తోంది.

**నకమోటో అజ్ఞాతంలో**

ఇప్పటికే నకమోటో అజ్ఞాతంలో ఉన్నాడు. దీనికి బిట్ కాయిన్ విలువపెరగడం కూడా ఓ కారణమని తెలుస్తోంది. ప్రభుత్వాలు, నేరమయ వ్యక్తుల వల్ల అతడికి ఇబ్బందులు ఎదురవుతున్నట్టు తెలుస్తోంది. అతడికి ఈ క్రిప్టో కరెన్సీ మీద ఆసక్తి కూడా తగ్గినట్టు సమాచారం. దానివల్లే అతడు మాయ ప్రపంచాన్ని వదిలిపెట్టినట్టు ప్రచారం జరుగుతుంది... కోడ్ కూడా రోజురోజుకు కఠినంగా మారుతుంది. నిబంధనలలో లోపాలు సర్వ సాధారణంగా మారిపోతున్నాయి.. అందువల్లే అతడు అజ్ఞాతంలో ఉన్నట్టు తెలుస్తోంది..

## టీవీలలో యూ ట్యూబ్ చూసే వారికి షాక్

» ఇకపై 90 సెంకడ్లపాటు అన్ స్కిపబుల్ యాడ్స్ ప్రసారం

» ఆదాయం పెంచుకునేందుకు యూట్యూబ్ నిర్వాహకుల కొత్త ఎత్తుగడ

**(ఒకే తెలుగు, బిజినెస్ డెస్క్)**

ఫోన్లలో యూట్యూబ్ చూడటం సర్వసాధారణం. కానీ కొంతకాలంగా మారిన టెక్నాలజీ వల్ల చాలామంది టీవీలలోనే యూట్యూబ్ వీక్షిస్తున్నారు. నచ్చిన వీడియోలను చూసేస్తున్నారు. రీల్స్, షార్ట్స్, సినిమాలు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఎన్నెన్నో యూట్యూబ్ లో వీక్షిస్తున్నారు. ఓ వేదిక ప్రకారం గృహిణులు.. వృద్ధులు ఎక్కువగా యూట్యూబ్ ను టీవీలలో చూస్తున్నారు.

**ఇటీవల కాలంలో పెరిగిపోయారు**

టీవీలలో యూట్యూబ్ చూసేవారు ఇటీవల కాలంలో పెరిగిపోయారు. దీనిని దృష్టిలో పెట్టుకున్న యూట్యూబ్ సరికొత్త నిబంధన తీసుకొచ్చింది. దీని ప్రకారం టీవీలలో స్కిప్ చేయడానికి వీలు లేకుండా 90 సెకండ్ల పాటు బఅంఖఞజుఖ్రీవ యాడ్స్ ప్రసారం చేయనుంది. ప్రయోగ దశలో ఉంది. యూజర్లను ప్రీమియం వైపు మళ్ళించడమే దీని ఉద్దేశమని తెలుస్తోంది. ఆదాయం పెంచుకునే క్రమంలో యూట్యూబ్ ఈ విధానాన్ని తీసుకొచ్చిందని సమాచారం. ఇప్పటికే ఓటీటీలో అన్ని యాప్స్ ఇదే ధోరణి కొనసాగిస్తున్నాయి. ఇటీవల జియో హాట్ స్టార్ రెండు రకాల సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రీమియంలో కూడా రెండు కేటగిరీలను పెట్టింది.

**యూట్యూబ్ కూడా అదే దారిలో**

యూట్యూబ్ కూడా అదే దారిలో వెళ్తోంది. రెవెన్యూ పెంచుకోవడమే మార్గంగా ప్రణాళికలు రూపొందిస్తుంది. పైగా ఖర్చును కూడా తగ్గించుకుంటున్నది. ఇప్పటికే విడుతలవారీగా ఉద్యోగులను తగ్గించిన యూట్యూబ్.. కంటెంట్ క్రియేటర్లకు చెల్లించే డబ్బు విషయంలో కూడా అనేక నిబంధనలను పాటిస్తోంది. గతంలో ఉదారంగా డబ్బులు ఇచ్చే యూట్యూబ్.. కొంతకాలంగా చెల్లింపులకు పూర్తిగా కత్తెర వేసింది. దీంతో కంటెంట్ క్రియేటర్లు చాలావరకు ఆదాయాన్ని కోల్పోతున్నారు. పేరు మోసిన చానల్స్ మినహా.. మిగతా వాటికి ఆశించిన స్థాయిలో డబ్బులు రావడం లేదు.

**విరివిగా డబ్బులను ఖర్చుపెట్టింది**




యూట్యూబ్ యాజమాన్యం మొదట్లో ప్రాచుర్యం పొందడానికి మొదట్లో విరివిగా డబ్బులను ఖర్చుపెట్టింది. ఆ తర్వాత ఖర్చును పూర్తిగా తగ్గించుకున్నది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను వాడుతున్నది. కంటెంట్ చెకింగ్ లో కూడా గతంలో మాదిరిగా ఉదారంగా వ్యవహరించడం లేదు. అందువల్లే చాలామంది కంటెంట్ క్రియేటర్లు యూట్యూబ్లో వీడియోలను అంతగా అప్లోడ్ చేయడం లేదు. ఇంత జరుగుతున్నప్పటికీ యూట్యూబ్ యాజమాన్యం వెనక్కి తగ్గడం లేదు. పైగా, ఆదాయాన్ని పెంచుకోవడానికి అనేక రకాల మార్గాలను అన్వేషిస్తుంది. యూట్యూబ్ తీసుకురాబోయే ఈ నిబంధనల పట్ల టీవీ వీక్షకులు అసంతృప్తితో ఉన్నారు. కాలక్షేపం కోసం యూట్యూబ్ చూస్తుంటే.. మధ్యలో ఈ యాడ్స్ గోల ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## పిట్టల కోసం మొక్కను నాటాడు

**(ఒకే తెలుగు, తెలంగాణ బ్యూరో)**

మొక్క అనేది చిన్న పరిమాణంలోనే ఉంటుంది. అది పెరుగుతూ వృక్షం లాగా మారుతుంది. వృక్షమైన తర్వాత ఎన్నో రకాలుగా పర్యావరణానికి ఉపయోగపడుతుంది. పిట్టల నుంచి మొదలు పెడితే సేద తీరే మనుషుల వరకు ప్రతి ఒక్కరికి చెట్టు అనేది పరోపకారిగా ఉంటుంది. అందుకే తరువును మించిన సహాయము.. చెట్టును మించిన ఉపకారము ఈ ప్రపంచంలో ఎవరూ చేయలేరు అంటారు.

**చెట్ల సంఖ్య తగ్గిపోతుంది**

ప్రస్తుతం అభివృద్ధి అనే మాయలో మనిషి పడిపోయాడు. అందువల్లే చెట్ల సంఖ్య తగ్గిపోతుంది. చెట్ల ఆధారంగా ఉండే వ్యవస్థ కూడా నాశనం అయిపోతుంది. దీనివల్ల జరుగుతున్న పరిణామాలను చాలామంది జీర్ణించుకోలేకపోతున్నారు. అందులో గీసుకొండ ప్రాంతానికి చెందిన వీరగోని రాజ్ కుమార్ కూడా ఉన్నారు. ఈ పరిస్థితిని ఎలాగైనా మార్చాలని ఆయన అనుకున్నారు. దానికి తగ్గట్టుగానే ఒక ఆలోచన చేశారు. అతడు చేసిన ఆ ఆలోచన అందరితోనూ చప్పట్లు కొట్టిస్తోంది.

**ఒక మనిషి కాలం చేస్తే**



ఒక మనిషి కాలం చేస్తే తెలంగాణ సాంప్రదాయం ప్రకారం మూడు, ఐదు రోజుల్లో పక్షికి వేస్తారు.. పదో రోజు దినం చేస్తారు. ఈ మూడు రోజులు కూడా పక్షులకు ఆహారం పెట్టడం సర్వసాధారణం. ఆహారం వండి పెట్టడం ద్వారా పక్షుల రూపంలో చనిపోయిన వ్యక్తి వచ్చి తింటాడని ఒక బలమైన నమ్మకం. బలగం సినిమా కూడా ఇదే నేపథ్యంతో రూపొందింది. అయితే చెట్లు లేకపోవడం వల్ల పక్షులు రావడం లేదు. దీంతో పిట్టకు పెట్టె ప్రక్రియ లో అవాంతరాలు ఏర్పడుతున్నాయి. దీనిని గమనించిన రాజ్ కుమార్ ఒక వినూత్నమైన ఆలోచనకు శ్రీకారం చుట్టాడు. గీసుకొండ లో స్మశాన వాటికలో చెట్లు కనిపించకపోవడంతో రాజ్ కుమార్ లో ఆలోచన పెరిగింది. అతనికి వచ్చిన ఆలోచన మొక్కను పెంచే విధంగా చేసింది. రాజ్ కుమార్ స్మశాన వాటికలో మొక్కను పెంచాడు. అవి కాస్త వృక్షంగా మారిపోయింది.. ఆ వృక్షం మీద పిట్టలు నివాసం ఉండడం మొదలుపెట్టాయి. ఫలితంగా ఎవరైనా చనిపోతే పిట్టకు వేసే ప్రక్రియ నిరాటంకంగా సాగిపోతోంది. రాజ్ కుమార్ స్మశాన వాటికలో నాటిన ఒక మర్రి మొక్క పెద్ద వృక్షంగా మారింది. దానిని ఆలవాలంగా చేసుకొని అనేక పక్షులు నివసిస్తున్నాయి. అంతేకాదు అంత్యక్రియల కోసం వచ్చిన వారు ఆ చెట్టు నీడన సేద తీరుతున్నారు.

**పిట్టముట్టే కార్యక్రమం విజయవంతంగా**

"పిట్ట ముట్టడం అనేది తెలంగాణలో ఒక సాంప్రదాయం. పిట్ట ముట్టకపోతే చనిపోయిన వారి ఆత్మ శాంతించలేదని అర్థం. మా స్మశాన వాటికలో చెట్లు అసలు లేవు. అందువల్లే 2015లో ఒక మర్రి మొక్కను నాటాను. అది కాస్త పెద్ద వృక్షం లాగా మారింది. ఇక అనేక మొక్కలు నాటితే అవి కూడా చెట్లు అయ్యాయి. వాటి మీద పక్షులు జీవిస్తున్నాయి. అందువల్లే పిట్టముట్టే కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని" రాజ్ కుమార్ చెబుతున్నాడు.

## క్రికెట్ మైదానంలోకి ఇష్టం వచ్చినట్టు

# ఆటగాళ్లు రావడం కుదరదు

**(ఒకే తెలుగు, స్పోర్ట్స్ ప్రతినిధి)**
ఐపీఎల్ జోరుగా సాగుతోంది. ఆటగాళ్లు నువ్వా నేనా అన్నట్టుగా పోటీ పడుతున్నారు. జట్లు పోటాపోటీగా పరుగులు తీస్తున్నాయి. 200o టార్గెట్ కూడా చిన్నగా మారిపోతుంది. ఆ టార్గెట్ ఫినిష్ చేయడానికి జట్లు చివరి వరకు పోరాడుతున్నాయి. ఈ సీజన్ ఐపీఎల్ లో ప్రారంభ మ్యాచ్ బెంగళూరు, హైదరాబాద్ మధ్య జరిగింది. హైదరాబాద్ ఏకంగా 200o స్కోర్ చేసింది. ఆ టార్గెట్ ఫినిష్ చేయడానికి బెంగళూరు రంగంలోకి దిగి.. వేగంగా ఆడింది. ఓవర్లు పూర్తికాకముందే లక్ష్యాన్ని పూర్తి చేసి సంచలనం సృష్టించింది.

**అసలు సిసలైన క్రికెట్ మజా లభిస్తోంది**
ఐపీఎల్ లో ఆటగాళ్లు అద్భుతమైన ప్రదర్శన చేస్తున్న నేపథ్యంలో.. చూసేవాళ్ళకు అసలు సిసలైన క్రికెట్ మజా లభిస్తోంది. ఈ నేపథ్యంలో ఐపీఎల్ నిర్వాహక కమిటీ ఒక కొత్త నిబంధనను తెరపైకి తీసుకువచ్చింది. దాని ప్రకారం ఇకపై టీం షీట్ లో ఉన్న 16 మంది ప్లేయర్లకు మాత్రమే గ్రౌండ్లో ప్రవేశించడానికి అవకాశం ఉంటుంది. మిగతా ప్లేయర్లకు ఆ అవకాశం ఉండదు. అంతేకాదు ఆ ప్లేయర్లు డ్రింక్స్, బ్యాట్లు, వర్తమానాలు తీసుకురాకూడదని స్పష్టం చేసింది. బౌండరీ చుట్టూ ఐదుగురు కంటే ఎక్కువ బెంచ్ ప్లేయర్లు ఉండకూడదని స్పష్టం చేసింది. ఎల్ఈడీ యాడ్ బోర్డులు.. బౌండరీ లైన్ మధ్య ప్లేయర్లు తిరగడానికి అవకాశం లేదని ఐపీఎల్ నిర్వాహక కమిటీ స్పష్టం చేసింది.

**మైదానంలోకి వస్తే తప్పేంటి**
ఈ నిబంధన పట్ల కొంతమంది ప్లేయర్లు పెదవి విరుస్తున్నారు. టి20 అనేది స్వల్ప కాలంలో పూర్తయ్యే ఫార్మాట్ అని.. అలాంటప్పుడు ఆటగాళ్లు మైదానంలోకి వస్తే తప్పేంటి అని ప్రశ్నిస్తున్నారు. దీనివల్ల పోటీ హోరా హోరీగా సాగుతుందని.. ఆటగాళ్లు మరింత ఉత్సాహంతో ఆడేందుకు ఆస్కారం ఏర్పడుతుందని ప్లేయర్లు చెబుతున్నారు.




**పరిపాటిగా మారిపోయింది**
ఇటీవల కాలంలో ప్లేయర్లు కొంతమంది మైదానంలోకి రావడం.. డ్రింక్స్, బ్యాట్లు అందిస్తున్నామని సాకుతో వర్తమానాలను తీసుకురావడం పరిపాటిగా మారిపోయింది. దీనివల్ల క్రీడా స్ఫూర్తి పూర్తిగా దెబ్బతింటున్నదని ఐపీఎల్ నిర్వాహక కమిటీ భావించింది. అందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. దీనివల్ల ఇకపై 16 మంది ప్లేయర్లు మాత్రమే గ్రౌండ్లోకి ప్రవేశించడానికి ఆస్కారం ఉంటుంది. మిగతా ప్లేయర్లు కేవలం రిజర్వ్ బెంచ్ కు మాత్రమే పరిమితమవుతారు. అంతేకాదు వాళ్ళు కేవలం మ్యాచ్ మాత్రమే చూసేందుకు అవకాశం పొందుతారు. బయటనుంచి సంకేతాలు.. ఇతరత్రా ఈ విషయాలను ఆటగాళ్లకు చెప్పడానికి అవకాశం ఉండదు. ఒకవేళ ఈ నిబంధన ఎవరైనా ప్లేయర్లు అతిక్రమిస్తే తదుపరి చర్యలు తీవ్రంగా ఉంటాయని ఐపిఎల్ నిర్వాహక కమిటీ ఇప్పటికే స్పష్టం చేసింది.

# డేవిడ్ మిల్లర్.. నష్ట జాతకుడు

**(ఒకే తెలుగు, స్పోర్ట్స్ ప్రతినిధి)**
డేవిడ్ మిల్లర్.. ఇప్పుడు ఈ పేరు సోషల్ మీడియాలో విపరీతంగా సర్కులేట్ అవుతోంది. మనదేశంలోనే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా ఈ పేరు విస్తృతంగా చర్చకు దారితీస్తోంది.. వాస్తవానికి డేవిడ్ మిల్లర్. అద్భుతమైన క్రికెటర్. దక్షిణాఫ్రికా జట్టులో ప్రతిభావంతమైన ఆటగాడు. వేగంగా పరుగులు తీయగలడు. దూకుడుగా బ్యాటింగ్ చేయగలడు. పిచ్ సంబంధం లేకుండా ఆడగలడు. బౌలర్ ఎవరనేది చూడకుండా వీరోచితంగా ప్రదర్శన చేయగలడు.

**జీవితకాల బాధ**
మిల్లర్ ఉన్నాడు అంటే విధ్వంసం కచ్చితంగా జరుగుతుందని అంటారు . అతడు ఆడిన ఆట.. చేసిన పరుగులు అలాంటి నానుడి పుట్టే విధంగా చేశాయి. అటువంటి మిల్లర్ 2024 లో జరిగిన టి20 వరల్డ్ కప్ లో ఫైనల్ మ్యాచ్లో అవుట్ కావడం దక్షిణాఫ్రికా జట్టుకు జీవితకాల బాధను కలిగించింది. జట్టు గెలుస్తుందనుకుంటున్న తరుణంలో మిల్లర్ అవుట్ కావడం ఆ జట్టు విజయావకాశాలను దెబ్బతీసింది. మిల్లర్ అవుట్ కావడం అప్పట్లో విస్తృతమైన చర్చకు దారి తీసింది. మిల్లర్ ఔట్ అయిన తర్వాత.. పెవిలియన్ వెళ్తున్నప్పుడు కన్నీటి పర్యంతమయ్యాడు.. తట్టుకోలేక తలవంచుకున్నాడు.




**ఒక పరుగు తేడాతో**
సేమ్ అలాంటి సన్నివేశం బుధవారం నాటి మ్యాచ్లో చోటుచేసుకుంది. గుజరాత్ జట్టుతో జరిగిన మ్యాచ్లో ఢిల్లీ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న మిల్లర్.. ముందుగా గాయపడ్డాడు.. ఆ తర్వాత జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు రంగంలోకి వచ్చాడు. సిరాజు ఓవర్లో విధ్వంసానికి పరాకాష్టగా బ్యాటింగ్ చేశాడు. చివర్లో విజయానికి రెండు పరుగులు అవసరమైన సందర్భంలో.. ఒక పరుగు తీసే అవకాశం వచ్చినప్పటికీ.. వదులుకున్నాడు. అలా అతడు చూపించిన అతి విశ్వాసం ఢిల్లీ జట్టు కొంపముంచింది. ఫలితంగా ఒక పరుగు తేడాతో ఢిల్లీ జట్టు ఓడిపోవలసి వచ్చింది.

**మిల్లర్ మీద విమర్శలు**
ఢిల్లీ జట్టు ఓటమి తర్వాత మిల్లర్ మీద విమర్శలు పెరిగిపోతున్నాయి. ఆ ఒక్క పరుగు తీసి ఉంటే మ్యాచ్ పరిస్థితి మరో విధంగా ఉండేదని.. అతి విశ్వాసానికి వెళ్లి మిల్లర్ పరువు తీసుకున్నాడని క్రికెట్ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.. " మిల్లర్ ముమ్మాటికి నష్ట జాతకుడు. అనవసరంగా వచ్చిన అవకాశాన్ని వదిలేసుకున్నాడు. అతడు గనుక ఆ పరుగు తీసి ఉంటే మ్యాచ్ ఫలితం మరో విధంగా ఉండేది. చివరి బంతికి బై రూపంలో ఒక పరుగు వచ్చినా సరే ఢిల్లీ జట్టు గెలిచేదని" క్రికెట్ విశ్లేషకులు చెబుతున్నారు.


**కన్నీటి పర్యంతమయ్యాడు**
మ్యాచ్ ఓడిపోయిన తర్వాత మిల్లర్ కన్నీటి పర్యంతమయ్యాడు. ఆవేదనతో తల పట్టుకున్నాడు. ఆ సమయంలో ఢిల్లీ జట్టు కెప్టెన్ అక్షర్ పటేల్ అతడిని అనునయించాడు." నీ పని నువ్వు చేసావ్.. ఈసారి అదృష్టం మన వైపు లేదు. నీ ప్రయత్నంలో లోపం లేదు. నూటికి నూరు శాతం నీ ఎఫర్ట్ చూపించావని" అక్షర్ అతడిని ఓదార్చాడు. ఈ వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాలలో విపరీతంగా సర్కులేట్ అవుతోంది.

# బెంగళూరు, చెన్నై మ్యాచ్..

# గూగుల్ మోతెక్కిపోయింది

**(ఒకే తెలుగు, స్పోర్ట్స్ ప్రతినిధి)**
ఐపీఎల్ జరుగుతున్నప్పుడు.. ఏదైనా జట్టు భారీగా పరుగులు చేస్తే కొత్త రికార్డు సాధ్యమవుతుంది. ఒక ఆటగాడు భారీగా పరుగులు చేస్తే లేదా భారీగా వికెట్లు పడగొడితే.. సరికొత్త ఘనత లిఖితమవుతుంది. కానీ, ఈ రెండు జట్లు ఆడితే.. ప్రపంచ వ్యాప్తంగా సేవలందించే గూగుల్ మోతెక్కిపోయింది.. సరికొత్త రికార్డు సాధ్యమైంది.

**చిరకాల ప్రత్యర్థులుగా బెంగళూరు, చెన్నై**
ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో చిరకాల ప్రత్యర్థులుగా బెంగళూరు, చెన్నై జట్లు కొనసాగుతున్నాయి. ఈ రెండు జట్ల మధ్య పోటీని ఆటగాళ్లు మాత్రమే కాకుండా.. అభిమానులు కూడా విపరీతంగా ఆస్వాదిస్తూ ఉంటారు. గతంలో చెన్నై జట్టు







బెంగళూరు మీద సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించేది. ఇటీవల కాలంలో బెంగళూరు జట్టు గట్టిగా పోరాడుతోంది. పోరాడితే పోయేదేమీ లేదు అన్నట్టుగా ఆడుతోంది. ఫలితంగా చెన్నై జట్టు మీద విజయాలు సాధిస్తోంది.

**చెన్నై జట్టు మీద బెంగళూరు విజయాలు**
గత సీజన్లో చెన్నై జట్టు మీద బెంగళూరు విజయాలు సాధించింది. ఈ ఏడాది కూడా అదే పరంపరను కొనసాగిస్తుంది. ఇటీవలి మ్యాచ్లో బెంగళూరు చెన్నై మీద విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసి 250 పరుగులు చేసింది. ఆ తర్వాత చెన్నై జట్టును లక్ష్యానికి దూరంగానే ఉంచేసింది. బ్యాటింగ్లో అదరగొట్టిన బెంగళూరు.. బౌలింగ్లో కూడా అదే ధోరణి కొనసాగించింది.

**గూగుల్ కు కూడా..**
బెంగళూరు, చెన్నై జట్ల మధ్య జరిగిన మ్యాచ్ అభిమానులకు మాత్రమే కాదు.. గూగుల్ కు కూడా విపరీతంగా ఆదాయాన్ని తీసుకొచ్చింది.. మన దేశవ్యాప్తంగా అత్యధికంగా సెర్చింగ్ జాబితాలో ఈ మ్యాచ్ నిలిచింది. మొత్తంగా ఐదు మిలియన్ ప్లస్ సెర్చెస్ తో ఈ మ్యాచ్ రికార్డ్ సృష్టించింది.

**ఎవరు గెలుస్తారు?**
బెంగళూరు, చెన్నై జట్ల మధ్య జరిగే మ్యాచ్లో ఎవరు గెలుస్తారు? ఎవరు ఎక్కువ పరుగులు చేస్తారు? ఎవరు ఎక్కువ వికెట్లు తీస్తారు? ఏ స్థాయిలో పరుగులు నమోదు అవుతాయి? ఏ జట్టు ముందుగా బ్యాటింగ్ చేస్తుంది? విరాట్ కోహ్లీ సెంచరీ చేస్తాడా? మాత్రే మెరుపు వేగంతో పరుగులు తీస్తాడా? అనే ప్రశ్నలను గూగుల్ లో అభిమానులు సెర్చ్ చేశారు..

**అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా..**
ఈ మ్యాచ్లో బెంగళూరు గెలిచిన తర్వాత.. ఆ జట్టు అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ముఖ్యంగా ఓ బెంగళూరు మహిళా అభిమాని చెన్నై అభిమాని ఉద్దేశించి చేసిన రచ్చ సోషల్ మీడియాను షేక్ చేసింది. ఆ వీడియో ఇప్పటికి విపరీతంగా సర్కులేట్లో ఉంది. తదుపరి మ్యాచ్లో ఒకవేళ చెన్నై గెలిస్తే బెంగళూరుకు ఇంతకంటే ఎక్కువ ట్రీట్మెంట్ ఉంటుందని ఎల్లో ఆర్మీ అభిమానులు సోషల్ మీడియాలో వ్యాఖ్యానిస్తున్నారు.

# మూవీ రివ్యూ : అట్టట్ట అనిపించే డెకాయిట్




వైవిధ్యమైన థ్రిల్లర్ సినిమాలతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న అడివి శేష్, ఈసారి డెకాయిట్ అనే లవ్, యాక్షన్ మేళవించిన ఒక థ్రిల్లర్ తో మన ముందుకు వచ్చాడు. గతంలో క్షణం, గూఢచారి, మేజర్ వంటి హిట్లతో మంచి ఊపుమీదున్న శేష్, రూట్ మార్చి చేసిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ప్రేక్షకులను ఎంతవరకు మెప్పించగలిగింది? గత చిత్రాల తరహాలోనే ప్రేక్షకులను మెస్మరైజ్ చేసిందా లేదా అనేది రివ్యూలో చూద్దాం.

హరి దాస్ (అడివి శేష్), సరస్వతి అలియాస్ జూలియట్ (మృణాల్ ఠాకూర్) ఒకరినొకరు ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించుకుంటారు. వారిద్దరూ పెళ్లి చేసుకుని కలకాలం హాయిగా జీవించాలని అనుకున్న సమయంలో ఒక నేరం జరగడం, తదనంతర పరిణామాల్లో సరస్వతి ఇచ్చిన సాక్ష్యం వల్ల హరి 13 ఏళ్ల పాటు హరి జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుంది. తన జీవితాన్ని నాశనం చేసిన ప్రియురాలిపై పగ తీర్చుకోవడమే లక్ష్యంగా హరి జైలు నుంచి తప్పించుకుని బైటకి వస్తాడు. అప్పటికే జూలియట్ మరొకరిని పెళ్లి చేసుకొని ఉంటుంది. అంతే కాకుండా జూలియట్ ఒక పెద్ద ఆపదలో ఉంటుంది. పగ తీర్చుకోవాలని జైలు నుంచి బైటికొచ్చిన హరి నిజంగా పగ తీర్చుకున్నాడా? లేక జూలియట్ గురించి అసలు నిజం తెలుసుకున్నాడా? చివరికి ఏమైంది అనేది మిగతా కథ.

సినిమాలో ఫస్ట్ హాఫ్ అంతా జైలు నుంచి తప్పించుకోవడం, హీరో బ్యాక్ స్టోరీని రివీల్ చేయడంతో ఆసక్తికరంగానే సాగుతుంది. అయితే సెకండ్ హాఫ్ లో కథనం నెమ్మదించడం సినిమాకి మైనస్. క్లైమాక్స్ లో వచ్చే ఎమోషనల్ టర్న్ కొంతమేరకు ఈ మైనస్ లను కవర్ చేసినా ప్రేక్షకులకు అద్భుతమైన సినిమా చూశామనే తృప్తిని మాత్రం ఇవ్వలేకపోయింది. కథ కంటే ఎక్కువగా స్పీడ్ ఎడిటింగ్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫీ తో సినిమాను నడిపించే ప్రయత్నం జరిగింది. దీనివల్ల ప్రేక్షకులు కొంతమేరకు ఎంగేజ్ అయినప్పటికీ సినిమా అంతా అయిపోయిన తర్వాత చూసుకుంటే మాత్రం ఓస్ ఇంతేనా అనే నిట్టూర్పు కలగక మానదు. నిజానికి ఈ సినిమా లవ్, క్రైమ్ అనే రెండు జోనర్లు మిక్స్ చేసి థ్రిల్లర్ గా ప్రెజెంట్ చేసిన కిచిడీ అనే చెప్పాలి. కొన్ని ఎపిసోడ్స్ లో, ముఖ్యంగా దోపిడీ ఎపిసోడ్స్, క్లైమాక్స్ లో సినిమాటిక్ లిబర్టీ ఎక్కువే తీసుకున్నారు. అలా అని సినిమా నీరసంగా ఉందా అంటే అదేమీ లేదు కానీ అడివి శేష్ సినిమా నుంచి అద్భుతం ఆశించే వారికి మాత్రం నిరుత్సాహం తప్పదు.

**రివ్యూ:** డెకాయిట్
**నటీనటులు:** అడివి శేష్, మృణాల్ ఠాకూర్, అనురాగ్ కశ్యప్, ప్రకాష్ రాజ్, అతుల్ కులకర్ణి, సునీల్
**సంగీతం:** భీమ్స్ సిసిరోలియో
**ఛాయాగ్రహణం:** ధనుష్ భాస్కర్
**దర్శకత్వం:** షానీల్ దేవ్
**నిర్మాతలు:** సుప్రియ యార్లగడ్డ

అడివి శేష్ సినిమాలంటే సహజంగా స్క్రీన్‌ప్లేలో మ్యాజిక్ తో చివరివరకూ ప్రేక్షకులను ఊపిరి బిగబట్టేలా చేసేవే. ఈ సినిమాను కూడా దర్శకుడు షానీల్ దేవ్ టెక్నికల్ గా సినిమాను చాలా హై స్టాండర్డ్స్ లో ప్రజెంట్ చేశాడు. సినిమాలో యాక్షన్ ఎపిసోడ్స్ బాగున్నాయి. రైటింగ్ విషయానికి వస్తే కథ గొప్పగా లేనప్పటికీ స్క్రీన్ ప్లే తో మ్యాజిక్ చేయాలని చేసిన ప్రయత్నం కొంతమేరకే సఫలం అయింది. డైలాగ్స్ మాత్రం క్రిస్ప్ గా ట్రెండీగా ఉన్నాయి. పాటలు యావరేజ్ గానే ఉన్నాయి కానీ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మాత్రం చాలా సీన్స్ ను ఎలివేట్ చేసింది. దానికి తగ్గట్టుగా సినిమాటోగ్రఫీ, స్పీడ్ ఎడిటింగ్ సినిమాకు ట్రెండీనెస్ తీసుకొచ్చాయి.

నటీనటుల విషయానికి వస్తే హరిదాస్ పాత్రలో అడివి శేష్ సులువుగానే చేసుకుంటూ పోయాడు. రాయలసీమ యాస కొంతవరకూ నప్పింది కానీ పూర్తి మార్కులు అయితే వెయ్యలేం. యాక్షన్ సీన్స్ లో మాత్రం చెలరేగిపోయాడు.. ఇక మృణాల్ ఠాకూర్ తన నటనతో ఆకట్టుకుంది. నటుడిగా మారిన బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ పోలీస్ ఆఫీసర్‌గా తనదైన ముద్ర వేయగా, ప్రకాష్ రాజ్, అతుల్ కులకర్ణి తమ పాత్రల పరిధి మేరకు మెప్పించారు.

### సినిమాలో బాగోలేనివి ఇవీ..

1. వీక్ అయిన సెకండ్ హాఫ్
2. దోపిడీల విషయంలో ఎక్కువైన సినిమాటిక్ లిబర్టీ

### ఇందులో ఏం బాగున్నాయో తెలుసా?

1. అడివి శేష్, మృణాల్ ఠాకూర్, అనురాగ్ కశ్యప్ ల పర్ఫార్మెన్స్
2. యాక్షన్ ఎపిసోడ్స్
3. నేపథ్య సంగీతం

**రేటింగ్: 2.5/5**

**ఫైనల్ వర్డ్: ప్రేమ ఎక్కువైంది.. థ్రిల్ తగ్గింది!**




# 'ఎల్ ఐ కే' ఫుల్ మూవీ రివ్యూ

### కథ

**2040 వ సంవత్సరంలో ప్రేమ ఎలా ఉంటుంది. అప్పుడు ప్రేమికులు ప్రేమలో ఓడిపోతే వాళ్లకు కలిగిన నష్టాన్ని భర్తీ చేయడానికి 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' ఉంటుంది. ఈ కంపెనీ కి సీఈఓ గా ఎస్ జే సూర్య ఉంటాడు. ఇక ప్రదీప్ రంగనాథన్, కృతి శెట్టి ప్రేమించుకుంటారు. పీకల్లోతు ప్రేమ లో ఉన్న వీళ్ళు ఎందుకు విడిపోవాల్సి వచ్చింది. ఆ ఇన్సూరెన్స్ కంపెనీ వల్ల వాళ్లకు కలిగిన లాభం ఏంటి? ఫైనల్ గా వీళ్లిద్దరు కలిశారా లేదా అనేది తెలియాలంటే మీరు ఈ సినిమా చూడాల్సిందే...**

ప్రస్తుతం ఇండియన్ సినిమా ఇండస్ట్రీ కొత్త పుంతలు తొక్కుతుంది. డిఫరెంట్ సబ్జెక్టుతో ప్రేక్షకుల ముందుకు వచ్చి సక్సెస్ లను సాధిస్తున్నారు. ముఖ్యంగా యంగ్ హీరోలైతే ప్రేక్షకులను ఆకట్టుకోవడమే లక్ష్యంగా పెట్టుకొని సినిమాలను ఓకే చేసుకుంటున్నారు. అయిన ప్రదీప్ రంగనాథన్ వరుసగా మూడు సక్సెస్ లతో హ్యాట్రిక్ విజయాలను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక ఇప్పుడు 'ఎల్ఐకే' సినిమాతో మరోసారి ఈరోజు ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఇక ఈ సినిమా ఎలా ఉంది సగటు ప్రేక్షకులను మెప్పించిందా? లేదా అనే విషయాన్ని మనం ఒకసారి తెలుసుకుందాం...

### విశ్లేషణ

దర్శకుడు విఘ్నేష్ శివన్ ఈ సినిమాలో ఫ్యూచర్ జనరేషన్ ఎలా ఉండబోతుందో కండ్లకు కట్టినట్టుగా చూపించాడు. ముఖ్యంగా ప్రదీప్ రంగనాథన్ హీరోయిన్ కృతి శెట్టి క్యారెక్టర్లను మలిచిన విధానం కూడా చాలా బాగుంది. మంచి ప్రేమికుడు ఎలా ఉంటున్నాడు అనే దానికి 2040 వ సంవత్సరంలో ప్రేమికులు ఎలా ఉండబోతున్నారనే దాని మీద చాలా బాగా రీసెర్చ్ చేసి మరి ఆయన ఈ సినిమా చేశాడు. ఇక మొదటి సీన్ లోనే ఈ సినిమాకు సంబంధించిన విజన్ అర్థమైపోతుంది...

సినిమాలోని కీలకమైన సన్నివేశాలను చాలా బాగా హ్యాండిల్ చేసిన విఘ్నేష్ శివన్ ఫస్టాఫ్ లో కొంతవరకు తడబడ్డాడు. అయినప్పటికి సెకండాఫ్ లో చాలా క్లారిటిని మెయింటైన్ చేస్తూ ముందుకు సాగాడు. ముఖ్యంగా ఆయన సినిమాల్లో ఒక కోర్ ఎమోషన్ అయితే సినిమా మొత్తాన్ని రన్ చేస్తూ ఉంటుంది. ఇక ఈ సినిమాలో కూడా అదే పాటర్న్ ఫాలో అవుతూ ముందుకు దూసుకెళ్లాడు... ఇక దానికి తోడుగా ప్రదీప్ రంగనాథన్ చేసే కామెడీ ఎపిసోడ్స్ బాగున్నాయి. ప్రదీప్ ఎస్ జే సూర్య మధ్య వచ్చే సన్నివేశాలు, హీరో హీరోయిన్ మధ్య లవ్ సీన్స్ అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంగేజ్ చేశాయి.

ఇక సెకండాఫ్ లో ఒక కోర్ ఎమోషన్ మీద సాగే సన్నివేశాలు సైతం ప్రేక్షకుడిని రక్తం కట్టించాయి. ఓవరాల్ గా ఈ సినిమాను దర్శకుడు బాగా హ్యాండిల్ చేశాడనే చెప్పాలి... క్లైమాక్స్ సన్నివేశం కొంతవరకు డల్ అయింది. రొటీన్ రెగ్యులర్ గానే అనిపించింది. ఇలాంటి డిఫరెంట్ కాన్సెప్ట్ ఎంచుకున్నప్పుడు దాన్ని కూడా కొంచెం కొత్తగా రాసుకొని ఉంటే సినిమా మీద ఇంపాక్ట్ ఇంకాస్త ఎక్కువగా ఉండేది...

### ఆర్టిస్టుల పర్ఫామెన్స్

ప్రదీప్ రంగనాథన్ గత సినిమాల మాదిరిగానే ఈ మూవీలో చాలా ఇంటెన్స్ యాక్టింగ్ చేశాడు. 'లవ్ టుడే' సినిమాలో ఎలాగైతే హ్యూమర్ తో ప్రేక్షకులను ఆకట్టుకున్నాడో ఈ మూవీలో అలాంటి సన్నివేశాలను చాలా ఈజ్ తో చేశాడు... కృతి శెట్టి సైతం హీరో పాత్రకి చాలా బాగా సపోర్ట్ చేసింది. ముఖ్యంగా తన పాత్రకి చాలా ఇంపార్టెన్స్ ఉండడంతో తను కూడా చాలా బాగా నటించింది... ఎస్ జె సూర్య ఇంతకుముందు చేసిన అన్ని సినిమాలకంటే కూడా ఇందులో వైవిధ్యభరితమైన నటనని చూపించాడు. ముఖ్యంగా ఆయన కొన్ని కామెడీ సీన్స్ లో చాలా బాగా యాక్టింగ్ చేశాడు. దానికి తోడుగా ఎమోషనల్ సన్నివేశాల్లో కూడా ఆయన చాలా బాగా నటించి మెప్పించాడు... ఇక మిగిలిన నటీనటులందరూ వల్ల పాత్ర పరిధి మేరకు ఓకే అనిపించారు...

### టెక్నికల్ అంశాలు...

అనిరుధ్ అందించిన మ్యూజిక్ ఈ సినిమాకి చాలా వరకు ప్లస్ అయిందనే చెప్పాలి. ముఖ్యంగా బ్యాక్గ్రౌండ్ స్కోర్ విషయంలో ఆయన చాలా బాగా కేర్ఫుల్ గా వ్యవహరించాడు. సాంగ్స్ కూడా ఈ సినిమాకి హైలెట్ అయ్యాయి. అనిరుద్ ఈ సినిమాకి తన మ్యూజిక్ తో ప్రాణం పోశాడు... సినిమాటోగ్రఫీ కూడా 2040వ సంవత్సరంలో ఎలాంటి పరిస్థితులు ఉంటాయి. ఎలాంటి లొకేషన్స్ ఉంటాయి వాటన్నింటిని కెమెరాలో చాలా బాగా బంధించారు. ప్రొడక్షన్ వాల్యూస్ కూడా బాగున్నాయి...

### ఈ సినిమాలో బాగున్నవి...

ప్రదీప్ రంగనాథన్, ఎస్ జే సూర్య యాక్టింగ్
కథ
ఎమోషనల్ సీన్స్

### ఈ మూవీలో బాగోలేనివి

రొటీన్ క్లైమాక్స్
ఫస్టాఫ్ కొంచెం లాగ్ అయింది...

**రేటింగ్ : 2.5/5**

చివరి లైన్ : వీలైతే ఫ్యామిలీ తో కలిసి ఒకసారి చూడవచ్చు...

## మెగా ఫ్యామిలీ లోకి కోడలిగా మరో యంగ్ హీరోయిన్

టాలీవుడ్‌లో మెగా ఫ్యామిలీకి సంబంధించిన ఓ ఆసక్తికర వార్త ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఒక మెగా స్టార్ కిడ్ , యంగ్ హీరోయిన్ మధ్య గత కొంతకాలంగా ప్రేమాయణం నడుస్తోందని, ఈ జంట త్వరలో పెళ్లి బంధంతో ఒక్కటయ్యే అవకాశం ఉందని టాక్. మెగా హీరో పంజా వైష్ణవ్ తేజ్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆయనతో పాటు 'ఉప్పెన' హీరోయిన్ కృతి శెట్టి పేరు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ఉప్పెన' సినిమా సమయంలో మొదలైన వీరి స్నేహం ఇప్పటికీ కొనసాగుతుండటంతో, అది ప్రేమగా మారి ఉండొచ్చని కొందరు భావిస్తున్నారు. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. కాబట్టి ఇవన్నీ కేవలం పుకార్లే కావచ్చని, నిజం ఏంటో తెలుసుకోవాలంటే కొంతకాలం వేచి చూడాల్సిందే అని సినీ వర్గాలు చెబుతున్నాయి.

Printed and published by Bhaskar Rao Katiki, on behalf of Swarna Enterprises Private Limited. Hitec ciry, Hyderabad-500030.
Editor: A.Naresh . email: oktelugu.com@gmail.com